క్లుప్తంగా

స్వచ్ఛ సుల్తానాబాద్‌లో భాగస్వామ్యం కావాలి



పతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్,సిబ్బంది

సుల్తానాబాద్: స్వచ్ఛ సుల్తానాబాద్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత గౌడ్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణంలో పలు ప్రాంతాలలో కాలనీవాసులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోజువారీగా తడి చెత్తను పొడి చెత్తను వేరుచేసి స్వచ్ఛఆటోలకు ఇవ్వాలని కోరారు. చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలంలో గాని పారవేయరాదని సూచించారు. ఈ సందర్భంగా పలు వార్డులోని ప్రజలతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు, ఆర్పీలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బౌద్ధస్తూపాన్ని సందర్శించిన విద్యార్థులు



బౌద్ధస్తూపం వద్ద ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఎలిగేడు: మండల కేంద్రంలో శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం మూడో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మండలంలోని ధూళికట్ట బౌద్ధస్తూపాన్ని సందర్శించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్ మాట్లాడుతూ 2000వేల సంవత్సరాల చరిత్ర గల ధూళికట్ట బౌద్ధస్తూపం సందర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు మూడో రోజు సర్వే ఆఫ్ యూత్ నాట్ ఇన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ ఆర్ రెగ్యులర్ ఎంప్లాయ్‌మెంట్ అనే అంశంపై సర్వే చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కమలాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రావణ్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



మాట్లాడుతున్న అడిషనల్ పీడీ సునీత

జూలపల్లి: మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించాలని పెద్దపల్లి అడిషనల్ పీడీ సునీత సూచించారు. మండల కేంద్రంలోని వెలుగు దీప్తి మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామాల మహిళా సంఘం సభ్యుల సమావేశంలో మాట్లాడారు. మహిళలు ఆరోగ్య పరంగా అవగాహన పెంచుకోవాలని,బ్యాంకు లింకేజీ, రుణాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. సభ్యులు సమష్టి కృషితో ఎంచుకున్న వ్యాపారాభివృద్ధికి , ఆర్థిక క్రమశిక్షణ పాటించి లక్ష్యం చేరుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఏపీఎం సుధాకర్, సీసీలు మద్దెల జ్యోతి, మల్లేశం, శ్రీధర్ స్వామి, శోభారాణి, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం



సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఆర్ఎంపీలు

రామగిరి:మండలంలోని నాగేపల్లి గ్రామపంచాయతీ దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారంలో భాగంగా జిల్లా స్థాయి పంచాయతీ అవార్డును సాధించింది. ఈ సందర్భంగా సోమవారం సర్పంచ్ కొండవేన ఓదెలు యాదవ్‌ను మండల ఆర్ఎంపీల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ఆర్ఎంపీల సంఘం అధ్యక్షుడు బొద్దుల జగన్, ప్రధాన కార్యదర్శి మల్లేష్, కోశాధికారి అనిల్, నాయకులు, ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

వడ్డీ మాఫీ ప్రొసీడింగ్ కాపీలు అందజేత

ధర్మారం: మండలంలోని దొంగతుర్తిలో సోమవారం స్వశక్తి సంఘం మహిళలకు వడ్డీ మాఫీ ప్రొసీడింగ్ కాపీలను ఇన్‌చార్జి సర్పంచ్ చంద్రశేఖర్ అందించారు. వడ్డీ మాఫీ చేయడంపై పలువురు మహిళలు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

కాలువల్లోకి జెన్‌కో బూడిద

- ఇళ్లలో డ్రెయినేజీ నీరు బయటకు వెళ్లక కాలనీవాసుల ఇబ్బందులు
- సమస్య పరిష్కరించాలని ప్రజల వేడుకోలు



కాలువల్లో నిండిన బూడిద



జెన్‌కో యాష్ పాండ్

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ పరిధి 23 వ డివిజన్ లోని ఆటోనగర్, సుభాష్‌నగర్ ప్రజల కష్టాలు పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 23వ డివిజన్‌లోని ప్రాంతాల్లో చాలామంది పేద ప్రజలు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరు చిన్నపాటి నివాసాలు ఏర్పరుచుకుని నివసిస్తూ పేదరికంతో కష్టాలను అనుభవిస్తున్నారు. వీరు నివసిస్తున్న ప్రాంతాలను పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ మధ్యన డ్రెయినేజీలో గతంలో యాష్ పాండ్ నుంచి నీరు వచ్చేది. దీంతో కాలువలో ఉన్న మురికి సైతం వెళ్లిపోయేది కాని వారం రోజులుగా జెన్‌కో యాష్ పాండ్‌లోని బూడిద రావడంతో కాలువల్లో పూర్తిగా బూడిద నిండి పోయింది. దీంతో లోతట్టు ఇళ్లల్లోని నీళ్లు బయటకు వెళ్లక వారు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులు జెన్‌కో యాష్‌పాండ్ నుంచి వచ్చిన బూడిదను కాలువలో నుంచి తొలగించి మురికి నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు వేడుకుంటున్నారు.

బూడిదతో ఇబ్బంది పడుతున్నాం



జెన్‌కో యాష్‌పాండ్ నుంచి వస్తున్న బూడిద వలన కాలువల్లో మొత్తం బూడిద నిండి పోయింది. ఇళ్లలోని నీరు బయటకు వెళ్లే మార్గం లేదు. కాలువలోని బూడిదను తొలగించి నీరు వెళ్లడానికి మున్సిపల్ అధికారులు జెన్‌కో వారిని ఆదేశించి ప్రజల ఇబ్బందులను తొలగించాలి.

– కొలుగూరి విజయ్, సుభాష్ నగర్

కాలనీ వాసులకు కష్టాలు



జెన్ యాష్ పాండ్ నుంచి ఎండకు బూడిద కాలనీపైకి వచ్చి ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం కాలువల్లో బూడిద వచ్చి మురుగు నీరు వెళ్లకుండా ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టని క్రమంలో యాష్ పాండ్ నుంచి బూడిద తరలించే వాహనాలను అడ్డుకుంటాం.

– దాసరి ఆనంద్, సుభాష్‌నగర్

జాతీయ స్థాయి అవార్డు సాధించాలి



సర్పంచ్‌ను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్టమధు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామపంచాయతీ జాతీయ స్థాయి అవార్డు సాధించాలని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. పల్లె ప్రగతిలో మండలంలోని జూలపల్లి తొమ్మిది విభాగాల్లో ఎంపికై దీన్‌దయాల్ ఉపాధ్యాయ సతత్ పంచాయతీ పురస్కారంలో జిల్లా స్థాయి అవార్డు ఎంపికై అవార్డు సాధించింది. ఈ సందర్భంగా సోమవారం జూలపల్లిలో సర్పంచ్ బొల్లపెల్లి శంకర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణను జెడ్పీ చైర్మన్ పుట్టమధు సన్మానించారు. అనంతరం గ్రామంలోని బీరప్ప ఆలయాన్ని పరిశీలించి నూతన ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో కిషన్‌రెడ్డి, ఇనగంటి భాస్కర్‌రావు, రాసకొండ రవి, బొల్లపెల్లి లక్ష్మయ్య, గోపాల్, స్వామి, రవి, రాజయ్య పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించిన జెడ్పీ చైర్మన్

మంథని: పార్లమెంట్‌లో బీసీ బిల్లు సాధనకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు మంథనిలో సోమవారం బీసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ, కమాన్‌పూర్ ఎంపీపీ రాచకొండ రవి, కమాన్‌పూర్ బీసీ సంఘం అధ్యక్షుడు దండె కిషన్, గ్రేటర్ హైదరాబాద్ బీసీ విద్యార్థి విభాగం వైస్ ప్రెసిడెంట్ రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం ప్రసాద్, రామగుండం నియోజకవర్గ అధ్యక్షుడు వింజమూరి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ పత్రాలు అందజేత

ముఖ్యమంత్రి సహాయ నిధితో పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత లభిస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. సోమవారం మంథనిలోని మాచిడి సత్యనారాయణకు రూ. 4 లక్షలు, రామగిరి మండలం ఆదివారంపేట గ్రామానికి చెందిన లక్కాకుల శంకరయ్య రూ. 2లక్షల విలువ చేసే ఎల్‌వోసీ పత్రాలను అందించారు.

పోషణ్ అభియాన్ పై అవగాహన



నాగేపల్లిలో పోషణ్ పక్వాడా ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ దేవక్క, అధికారులు, నాయకులు, విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: పోషణ్ పక్వాడాలో భాగంగా రామగుండం కార్పొరేషన్ ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టర్–3 సింగరేణి పాఠశాలలో 15.16.17.18.19 డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు సోమవారం పోషణ్ అభియాన్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పోషణ్ అభియాన్ పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో సింగరేణి పాఠశాల హెచ్ఎం పురుషోత్తం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి: అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అరెల్లి దేవక్క కోరారు. మండలంలోని నాగేపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారులకు రక్త, ఆరోగ్య పరీక్షలు చేయించారు. అనంతరం పోషణ్ పక్వాడ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓదెలు యాదవ్, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఎలిగేడు: పౌష్టికాహారం తీసుకుంటేనే ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంఈవో కవిత అన్నారు. మండలంలోని ధూళికట్ట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పోషణ్ పక్వాడ్ నిర్వహించారు. కిషోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి పౌష్టికాహార లోపం, ఐరన్ గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో కవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమాన్‌పూర్: రాహుల్‌గాంధీ పై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు వద్ద మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించినందుకే మోదీ కక్షపూరితంగా రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయించాడన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపెల్లి రాజయ్య, సర్పంచ్ ఆకుల ఓదెలు, ఉప సర్పంచ్ గుమ్మడి సతీశ్, కోల నర్సగౌడ్, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

సుల్తానాబాద్: కేంద్రం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని మున్నూరు కాపు యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ కోరారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పై అనర్హత వేటు ఎందుకు వేశారో ప్రధాని మోదీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని, ప్రజాస్వామ్యంలో నియంతృత్వ ధోరణి సరికాదని పేర్కొన్నారు.

రత్నాపూర్ కాపు సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్

రామగిరి:మండలంలోని రత్నాపూర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా మెట్టు వెంకటేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. మండల అడ్‌హక్ సభ్యులు కుడిది చలం, తోట శంకర్ ఆధ్వర్యంలో సోమవారం రత్నపూర్ రైతు వేదిక వద్ద నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పీవీరావు, ఉపాధ్యక్షుడిగా అబ్బ నరేష్, జనరల్ సెక్రటరీగా గుమ్మడి ప్రసాద్, సలహాదారుడుగా బర్ల వెంకన్న, జాయింట్ సెక్రటరీగా పానగంటి వీరేశం, గూడెపు మహేందర్, కోశాధికారి మిల్కురి శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా బిరుదు భూమయ్య, ఉనుకొండ మధుకర్, పెంచాల అభిలాష్, మెట్టు రవి, అబ్బ తిరుపతి, అబ్బ నరేశ్, బైన ఓదెలు, గుడెపు బాపు ఎన్నికయ్యారు.

మన ఊరు మన బడిపనులు ప్రారంభం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ

రామగిరి:మండలంలోని నాగేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు మనబడి పనులను సోమవారం ఎంపీపీ అరెల్లి దేవక్క ప్రారంభించారు. రూ 50 లక్షలతో చేపట్టనున్న డైనింగ్ హాల్, ప్రహరీ ఎత్తు, క్లాస్ రూముల మరమ్మతులు, అండర్ గ్రౌండ్ కరెంట్ వైరింగ్ పనులను ఆమె భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండవేన ఓదెలు యాదవ్, హెచ్ఎం గిరిధర్ రెడ్డి, లక్ష్మీనారాయణ ఉప సర్పంచ్ చిట్టెంపెల్లి అనిల్ కుమార్, నాయకులు దుద్దిల్ల రాజు, గద్దల శంకర్, వేగోలపు శ్రీనివాస్ గౌడ్, ఎర్రం శంకర్, చింతం మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు..

రామగిరి: ముత్తారం మండలంలోని దరియాపూర్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఎంపీపీ జక్కుల ముత్తయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చెల్కల స్వర్ణలత, సర్పంచ్ గాదం శ్రావంతి, ఎంపీటీసీ రామగల్ల పోచమ్మ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నూనె కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పాతమడిపెల్లిలో హుసేన్‌మియా వాగుతీరంలో మహాలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి రూ. 50 వేలు , కాల్వశ్రీరాంపూర్ జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి 10,016 రూపాయిలు ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు, జెడ్పీటీసీకి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ ఆడిగొప్పుల రాణి, నాయకులు మోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పద్మశాలీ భవన నిర్మాణానికి భూమిపూజ

ధర్మారం: మండలంలోని రచ్చపల్లిలో పద్మశాలీ సంఘం భవన నిర్మాణానికి సోమవారం జిల్లా సహకార సంఘాల ఫోరం చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి భూమిపూజ చేశారు. సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారంతో సంఘ భవన నిర్మాణానికి రూ.5లక్షల నిధులు మంజూరైనట్లు బలరాంరెడ్డి తెలిపారు. ఆరు నెలల్లో భవన నిర్మాణం పూర్తికావాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మోర సుధాకర్, ఎంపీటీసీ బెల్లాల రోజారాణి, ఉపసర్పంచ్ చిందం మల్లేశం, నాయకులు ఎనగందుల శ్రీనివాస్, సొల్లు అంజయ్య, పద్మశాలీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా కంది చొక్కారెడ్డి

జూలపల్లి: బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కాచాపూర్ కు చెందిన కంది చొక్కారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మండల బీఆర్ఎస్ నాయకులు సమావేశంలో చొక్కారెడ్డిని ఎన్నుకున్నారు. గతంలో చొక్కారెడ్డి జూలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా రెండేళ్లు పనిచేయగా, మూడు నెలల క్రితం పదవీ కాలం ముగిసింది. ఇంతకుముందు అధ్యక్షుడిగా పనిచేసిన కుమ్మరికుంటకు చెందిన శాతల్ల కాంతయ్య స్థానంలో చొక్కారెడ్డిని ఎన్నుకున్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని 23వ డివిజన్ బీఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జి కుమ్మరి శారద సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నిర్ణయాన్ని గౌరవిస్తూ పార్టీ కార్యకర్తగా సీఎం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను, రామగుండం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటా ప్రచారం చేస్తూ వచ్చే ఎన్నికల్లో కోరుకంటి చందర్ గెలుపే లక్ష్యంగా పని చేస్తానని వెల్లడించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

రామగిరి: ముత్తారం మండలంలోని ముత్తారం, లక్కారం, పోతారం ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు యూత్ ఫర్ సొసైటీ సభ్యులు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. వచ్చే నెల 3 నుండి నిర్వహించనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలలో ప్రతి ఒక్క విద్యార్థి మంచి గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ ఫర్ సొసైటీ సభ్యుడు ఇజ్జగిరి సాకేత్, అరెల్లి మహేందర్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ సొసైటీకి ప్రథమ స్థానం హర్షణీయం

- సీటీవో ఇన్‌చార్జి ఉమామహేశ్వరరావు

సుల్తానాబాద్: రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సుల్తానాబాద్ పీఏసీఎస్ ప్రథమ స్థానంలో నిలవడం హర్షణీయమని సీటీవో ఇన్‌చార్జి ఉమామహేశ్వరరావు అన్నారు. ఈ సంఘం అభివృద్ధి, పనితీరుపై డాక్యుమెంటరీ చిత్రీకరిస్తామని తెలిపారు. సోమవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని పీఏసీఎస్‌ను ఆయన సందర్శించారు. సొసైటీ ప్రారంభమైనప్పటి నుంచి దిన దినాభివృద్ధి చెందడానికి డైరెక్టర్లు, అధికారులు తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను రైతులకు అందజేసినప్పుడు రికవరీ ఎలా ఉండేదని అడగగా వారి సపోర్ట్ బాగుండేదని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈఎస్ఐ వాటర్ ప్లాంట్‌తోపాటు సూపర్ మార్కెట్, ఫర్టిలైజర్, ఇటీవల పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి పాలకవర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. పాలకవర్గం, అధికారులు సమన్వయంతో ముందుకెళ్లడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. పీఏసీఎస్ సక్సెస్‌పై డాక్యుమెంటరీ తీసి, పీటీఏ వద్ద భద్రపరచడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని సొసైటీలకు, ట్రైనింగ్ సెంటర్లకు పంపిస్తామని సీటీవో తెలిపారు. అధికారులు మంజూర్ గొసియా, విజయ్‌కుమార్ రెడ్డి, కేడీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, కార్యదర్శి బూరుగు సంతోష్ కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్ కుమార్, డైరెక్టర్లు గణేశ్, గోపయ్య, ఓదెలు, రాజయ్య, సురేష్ రెడ్డి, కమలమ్మ, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి

జూలపల్లి: మండల కేంద్రంలో నేడు నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని ఎంపీపీ రమాదేవి కోరారు. సోమవారం మండల కంది చొక్కారెడ్డితో కలిసి మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా పరిశీలకులు ఎర్రోళ్ల శ్రీనివాస్,పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామాల అధ్యక్షులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని పాండవుల గుట్టపై శ్రీజగత్‌మౌనీశ్వరాలయంలో సోమవారం శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆశ్రమపీఠాధిపతులు బసవత్తుల రాజమౌళి ఆచార్యులకు ఉత్సవ కమిటీ వేదపాఠశాల విద్యార్థులు మంగళవాయిద్యాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఉదయం 4 గంటలకు ప్రభాతభేరితో ప్రారంభమైన ఉత్సవాలు ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం–మంటప పూజలు, సావాకాలం బలిమరణలు, తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ రాంరెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులు ముల్కల గోవర్ధన్ శాస్త్రి పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు చూపిన ప్రేమను పంచాలి

మంథని: ఏసుక్రీస్తు జీవించిన సమయంలో మనుష్యులపై ఎలాంటి ప్రేమను పంచారో అలాంటి ప్రేమను ఇతరులపై పంచుకోవాలని హైదరాబాద్‌కు చెందిన శ్యామ్‌సుకుమార్ అన్నారు. సోమవారం మంథని పట్టణంలోని సియోను ప్రార్థనా మందిరంలో జరిగిన వార్షిక సభలో ఆయన ప్రసంగించారు. నిన్ను వలే నీ పొరుగు వారిని ప్రేమించు అనే ఏసుక్రీస్తు బోధనలు అందరూ అనుసరించాలన్నారు. పాస్టర్లు ఆగస్టీన్, వల్లూరి ప్రభాకర్, వాసాల జాన్, మంథని మాఋ్క్, కలువల సామ్యేల్, మంథని నవీన్, రాజేష్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని అమర్‌చంద్ కల్యాణమండపంలో మంగళవారం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చెక్కులు అందజేస్తారని తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు.

31న బార్ అసోసియేషన్ ఎన్నికలు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 31న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి కె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఇరుగురాల మహేందర్ తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ పోస్టులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 27, 28న నామినేషన్ల స్వీకరణ, 29న స్క్రూటిని, నామినేషన్ల ఉపసంహరణ, ఎన్నికలు 31న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. అదే రోజు సాయంత్రం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జీఎంకు వినతి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ వీర్లపల్లిలో సీసీరోడ్లు, తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, శ్మశానవాటిక నిర్మించాలని సోమవారం సింగరేణి ఆర్జీ–2 జీఎఎం మనోహర్‌కు గ్రామ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వేణుగోపాలరావు, శ్రీనివాస్ రెడ్డి, గణేష్, జంగా సంపత్ యాదవ్ పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు

మంథని: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో పరారీలో ఉన్న నిందితుడు పురాణం జంపయ్యను సోమవారం అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు మంథని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 4న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం కేసులో తొమ్మిది మంది నిందితులు, ఇద్దరు మైనర్లను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో జంపయ్య పరారీలో ఉన్నాడు. గోదావరిఖనిలోని ఎన్టీపీసీ ప్రగతినగర్‌లో నివాసముండే జంపయ్య గ్రామాల్లో తిరుగుతూ స్క్రాప్ దుకాణం నడిపిస్తూ అందులో భాగంగానే దొంగల నుంచి కాపర్ వైరు కొనుగోలు చేశాడని ఎస్సై తెలిపారు. ఈ మేరకు అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

'దళితుల అభ్యున్నతిని విస్మరిస్తున్న పాలకులు'

పెద్దపల్లిరూరల్:దళితుల అభ్యున్నతిని పాలకులు విస్మరిస్తున్నారని, దళిత, గిరిజనులపై దాడులు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదని దళిత హక్కుల పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం జిల్లా తొలి మహాసభ నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగిస్తున్న వారిపై చర్యలు కరువయ్యాయని, దళితుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులు పక్కదారి పడుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి సదానందం అన్నారు. ఈనెల 31న ఉస్మానియా వర్సిటీలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం దళితహక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడిగా పెర్క సతీశ్, ఉపాధ్యక్షుడిగా ఎర్రల రాజయ్య, ఆసాల రాము, ప్రధాన కార్యదర్శిగా రాజరత్నం, సహాయ కార్యదర్శిగా మద్దెల దినేశ్, రాకేశ్, కోశాధికారిగా బొద్దుల రమేశ్‌ను ఎన్నుకున్నారు.

లేబర్ కార్డులు పంపిణీ

ధర్మారం: మండలంలోని కొత్తూరులో అసంఘటిత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రేగుల జితేందర్ ఆధ్వర్యంలో సోమవారం లేబర్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం, ఉపసర్పంచ్ బానోతు రాజేశ్వరి, నాయకులు బానోతు రాజేశం, శ్రీనివాస్, లేబర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

భగీరథ ట్రయల్ రన్ 'లీకేజీ'



వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలో మిషన్‌భగీరథ నీటిసరఫరా కోసం మున్సిపల్ అధికారులు సోమవారం చేపట్టిన ట్రయల్ రన్ పట్టణంలోని కమాన్ వద్ద 'లీక్' అయింది. దీంతో కమాన్ ప్రాంతంలోని వీధులు జలమయమయ్యాయి. లీకేజీని గుర్తించామని రెండురోజుల్లోగా మరమ్మతులు చేసి వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఏఈ సతీశ్ తెలిపారు.